కథ

మీకు ఇష్టమైన టీవీ ఛానెల్లో అతికష్టమైన కన్నీటి సీరియల్ చూస్తుండగా ఐదారేళ్ళ మీ బుజ్జిగాడు- "అమ్మా! గున్న ఏనుగు అంటే ఏమిటే?" అని అడిగితే-

# కొత్తరంగులు

"ఏనుగుపిల్లరా" అని చెబుతారు.

"ఏనుగుపిల్ల ఎలా ఉంటుంది?" అన్నాడనుకోండి.


ఒళ్లు మండుతుంది. "ఏనుగు లాగే ఉంటుంది. కొంచెం చిన్నగా ఉంటుంది" అని కోపాన్ని అణచుకుంటూ చెప్పాల్సి వస్తుంది.

వెంటనే వాడు "మరి ఏనుగు పిల్ల అనే, పిల్ల ఏనుగు అనే అనొచ్చుగా. గున్నఏనుగు అనే ఎందుకనాలి?" అన్నాడనుకోండి. వెంటనే టెంకిజెల్ల ఒకటివ్వాలనిపిస్తుంది కదూ.

మాకైతే ఆ అవసరం లేదు. ఎందుకంటే...

"మన వీధిలో ఉండే సుబ్బరామయ్య అంకుల్ లాగా పొట్టిగా, లావుగా చలాకీగా ఉంటుంది కనుక గున్న అనే పేరొచ్చిందిరా!" అని చెప్పేయొచ్చు.

ఆ పదానికి అంత దగ్గరి పర్యాయపదంలా ఉంటాడు మా సుబ్బరామయ్య.



అతను మా వీధిలో ఇల్లు కట్టుకుని రెండేళ్ళు అవుతుంది. ముప్పై లక్షలు పోసి మహారాజ దర్బార్ లాంటి ఇల్లు కట్టాడనుకోండి. మరి కట్టడేంటి? అయిదారు కంపెనీల చాక్లెట్లను ఆంధ్రా అంతటా సప్లయి చేసే డీలర్. పైగా వడ్డీ వ్యాపారం, షేర్లు వగైరాలు మామూలే. ఆయన ఐశ్వర్యం, ఆ ఇంటి కొత్తరంగులలోనే తెలుస్తుంది.

ఈ రెండు సంవత్సరాల కాలంలో అతనూ, నేను ఏడెనిమిది సార్లు ఎదురుపడ్డాం. అయినా "హలో" అన్న పలకరింపు తప్ప ముచ్చటగా మాట్లాడుకున్నది మూడుసార్లే.

మూడుసార్లూ ఆయన ఒకే విషయం చెప్పి తెగ బాధపడిపోయాడు. తన బాధని నేను కూడా నా బాధగా అనుభూతి చెందాలని తెగ తాపత్రయపడ్డాడు. కానీ నాకు ఆ విషయం అంత బాధ కలిగించేదిగా అనిపించలేదు.

"ఆ...అవునండీ. మీరు చెప్పేది కరెక్ట్" లాంటి పడికట్టు పదాల్ని పైకి ఉచ్ఛరించినా చివరకు ముక్తాయింపు ఎలా ఇవ్వాలో నాకు అర్థంకాలేదు. బహుశా... నాలాగా 'ఏవరేజ్ బుర్ర' ఉన్న (మా ఆవిడ తరచూ సర్టిఫై చేసేట్టు) ఎవరికైనా అర్థం కాదనుకుంటా.

సదరు విషయం ఏమిటంటే శ్రీమాన్ సుబ్బరామయ్యగారు మా వీధిలో ఇల్లు కట్టక ముందు ఓల్డ్ టౌన్‌లో ఉండేవారు. అక్కడ ఇళ్ళన్నీ ఇరుకిరుగ్గా ఉండేవి. ఇప్పటికీ ఉన్నాయి. వారి ఫ్రెండ్ ఒకాయన విశాలంగా ఉంటుంది కదా అని ఏ ఏరియాకొచ్చి మా ప్రక్క వీధిలోనే ఇల్లు కట్టాడు. చాలా పెద్దదిలెండి.

చిన్నపిల్లలలో ఒకడు ఒక రంగు చాక్లెట్ కొనుక్కుంటే అక్కడున్న మిగతా పిల్లలంతా పేచీ పెట్టి అవే రంగు చాక్లెట్లు కొనుక్కున్నట్టుగా సదరు ఫ్రెండ్‌గారి ఫ్రెండ్స్ అందరూ అంటే ఆరుగురూ మా ఏరియాలోనే ఆరు

ఐ.వి. పద్మరాజు

వీధుల్లో ఆరు ఇళ్ళు కట్టించారు. గురువుగారు కూడా 'మమ' అనిపించారు.

అయితే ఒక్క వీరు తప్ప మిగతావారు ఇళ్ళు కట్టిన వీధులన్నీ పక్కా బిల్డింగ్‌లతో, కొత్త కొత్త రంగుల బిల్డింగ్‌లతో హైదరాబాద్‌లో బంజారాహిల్స్‌లాగా చూడడానికి పోష్ లొకాలిటీలాగా ఉన్నాయి.

సుబ్బరామయ్యగారు కట్టిన ఈ వీధిలో మాత్రం ఒక డాబా ఇల్లు డెబ్భై, ఎనభై ఏళ్ళనాటిది పిట్టగోడలు సగం, సగం పడిపోయి, గోడలు పెచ్చులూడిపోయి... బీటలు తీసి తూముల దగ్గర రావి మొక్కలు మొలుస్తూ చంద్రుడిలో మచ్చలాగా.. పెళ్ళికూతురు బుగ్గన చుక్కలాగా..వీధి పరువు తీసి వీధిలో పారేస్తూ..పాతరేస్తూ ఉంది.

దురదృష్టవశాత్తూ ఆ ఇల్లు మా ఇంటి పక్కనే ఉంది. ఆ 'పాడు' ఇల్లు వలన శ్రీవారికి వచ్చిన ఇబ్బంది ఏమిటంటే వారి ఇల్లు చూడడానికి వచ్చిన బంధుమిత్ర గణం అంతా "అరె వాళ్ళలాగా నీకు 'పోష్ లొకాలిటీ'లో దొరకలేదా?" అంటూంటే తల కొట్టేసినంత పని అవుతోందిట.

మొదటిసారి చెప్పినప్పుడు- "డబ్బున్నవాళ్ళ ఆలోచనా విధానం ఇలాగే ఉంటుందిలే" అని సరిపెట్టుకున్నాను.

ఇంకా నయం.. ఈమధ్యనే నేనూ ఇల్లు రీమోడలింగ్ చేయించాను. లేకపోతే నా ఇంటి వల్ల కూడా ఇలాగే ఇబ్బంది అనేవాడేమో.

రెండోసారి చెప్పినప్పుడు నేను అతి తెలివిగా అతని మాటలు పట్టించుకోకుండా టాపిక్ అతి లాఘవంగా డైవర్ట్ చేసేశాను.

మూడోసారి చెప్పేసరికి చనువు ఎంతదాకా పెరిగిందంటే "ఆ ఇంటివాళ్ళు మీ బంధువులేనట కదండీ.. అది పడగొట్టి ఇంకోటి చిన్నదైనా నీట్‌గా కట్టుకోమనండి" అన్నాడు. బంధువులన్న విషయం ఎలా తెలిసింది. 'పని మనుషుల ఛానెల్ ప్రత్యక్ష ప్రసారాలన్నమాట.

నాకు నషాళానికి అంటింది. అయినా సభ్యత కోసం అతి కష్టం మీద కోపం అపుకుని చెప్పాను. "వాళ్ళు...మా వాళ్ళే కానీ ఇప్పట్లో ఇల్లు కట్టే స్థోమతు లేదు, అయినా అంత స్టేజీ ఉంటే వాళ్ళు మాత్రం అలాంటి ఇంట్లో ఎందుకుంటారండీ?" అన్నాను.

చివరి వాక్యం చురకలా పనిచేస్తుందనుకున్నాను.

కానీ ఆ మాట ఎప్పుడంటానా అని ఎదురుచూస్తున్నట్టుగా "వాళ్ళబ్బాయి ఎక్కడో మంచి చిట్‌ఫండ్ కంపెనీలో పనిచేస్తున్నాడట కదా. లోన్ పెట్టి కట్టుకోమనండి. ఒకటీ...అరా తగ్గితే మనం సర్దుదాం. మీరు గవర్నమెంట్ ఎంప్లాయీ కదా హామీ ఉంటానంటే రెండు రూపాయల చొప్పున ఇద్దాం" అన్నాడు ఏదో ఇద్దరిదీ జాయింట్ వ్యాపారం అయినట్లు.

ఆశ్చర్యపోయాను. 'అమ్మ సుబ్బరామయ్యా ఒకే దెబ్బకి మూడు పిట్టలు కొట్టాలని చూస్తున్నావా?' అనుకున్నాను.

ఒకటి...నీ ఏరియా పరిపూర్ణమైన పోష్‌కాలిటీగా నీవు అనుకుంటున్నట్టుగా మారిపోవాలి.

రెండు..నీ డబ్బు ఏ బ్యాంక్ లోనూ రానంత వడ్డీ తేవాలి.

మూడు..నీ వ్యాపారానికి మంచి ష్యూరిటీ కావాలి.

ఆలోచనల్లో మునిగిన నన్ను చేయి పట్టుకుని కుదిపేస్తూ "ఆలోచించుకోండి సార్. తొందరలో చేసేద్దాం" అన్నాడు.

అంటే త్వరగా చెయ్యమని అన్నమాట.

మాటలోకి కటువుదనం తెచ్చుకుంటూ "అబ్బే... అసలు ఆ స్టేజీ లేదు. వచ్చినప్పుడు నేనే మీకు చెబుతాను" అన్నాను.

'ఇంకెప్పుడూ...ఈ విషయం ఎత్తనురా వెధవా..' అన్నట్టుగా.

నిరుత్సాహంతో వెళ్ళిపోయాడు. నా మనసు కాసేపు అచేతనం అయిపోయింది. "అసమర్థుడి ప్రతి స్థితీ.. డబ్బున్నవాడి దోపీడికీ అవకాశమే కదా!" అనిపించింది.

ఎందుకో తరతరాల-చరితం పాట గుర్తొచ్చింది.

నా కన్నీటి పొరల్లో ఆ ఇంటి వెనకాలున్న కథ, కష్టాలు, కన్నీళ్ళు, వేదనలూ... అప్రయత్నంగా కనబడుతున్నాయి.

* * *

మా తాతయ్య, అమ్మ నాన్నగారి ఇల్లు అది. నేను అక్కడుండి చదువుకునే ఇంత వాణ్ణయ్యాను. మావయ్య ఎంతో అపురూపంగా చూసుకునేవాడు ఆ ఇంటిని. "ఒరేయ్ శ్రీనూ.. నేను చేసేవి అణా కానీ ఉద్యోగాలే అయినా ఇలా బ్రతుకుతున్నానంటే కారణం పెద్దలు ఇచ్చిన ఈ సొంత కొంపే. లేదంటే అద్దెలు కట్టలేక బజారున పడిపోయేవాడిని" అనేవాడు.

పిల్లలు లేటుగా పుట్టడం, వాళ్ళు పుట్టిన రెండు సంవత్సరాలకే మావయ్య చనిపోవడంతో ఇంటి భారం అత్తయ్య మీద పడింది. పైసా ఆదాయం లేదు. చదువు లేదు. ఒక మాదిరిగా బ్రతికిన కుటుంబం కావడంతో బైటకు వెళ్ళి కనీసం వంటమనిషి, ఆయా లాంటి పనులు కూడా చేయలేదు. ఫలితం దుర్భర దారిద్ర్యం. అయినా పిల్లలమీదే కోటి ఆశలు పెట్టుకుని ఆ ఇల్లునే భగవంతుడిచ్చిన పెన్నిధిగా భావిస్తూ అప్పడాలు వత్తి, అగ్గిపుల్లలకు మందు చుట్టి, లేసు అల్లకం చేసి కష్టపడి పెంచింది పిల్లలిద్దరినీ. ఎంత కష్టం అంటే ఒక్కోరోజు రెండింటివరకూ జీరోవాట్ బల్బులో లేసు అల్లేది. ఇంటి పన్ను కట్టిన నెలలో వారం రోజులు పస్తులుండేది. ఎంతో మంది "ఎందుకమ్మా ఈ బాధలు! హాయిగా ఆ ఇల్లు అమ్మేసి... ఆ డబ్బేదో బ్యాంక్‌లో వేసుకుని వడ్డీ తింటూ కడుపులో చల్ల కదలకుండా ఉండొచ్చుగా" అని ఉచిత సలహాలు ఇచ్చినా ప్రలోభ పడలేదు. ఆ ఇల్లు నిలబెట్టుకోవడమే తన జీవితధ్యేయంలా భావించేది. ఇరవై ఏళ్ళు గుట్టుగా సంసారం లాక్కొచ్చింది. సంవత్సరం క్రితం వాళ్ళబ్బాయి రమేష్‌కి ఓ చిట్‌ఫండ్ కంపెనీలో కొంచెం మంచి ఉద్యోగమే రావడంతో ఇప్పటికి చేతినిండా అన్నం తింటున్నారు.

వాళ్లని ఇలా "మీ ఇల్లు చూడడానికి బాగా లేదు పడగొట్టి ఇంకోటి కట్టుకోండి" అనడం ఎంత అమానుషం. హాస్యాస్పదం?

* * *

కాలచక్రంలో పదిహేనేళ్ళు సినిమాలో రీళ్లలాగా.. గిర్రున తిరిగిపోయాయి.

రమేష్ ఉద్యోగం చేయడంతోపాటు సైడ్ బిజినెస్ పెట్టడం.. కాలం కలిసొచ్చి పట్టిందల్లా బంగారం కావడంతో ఏడాది క్రితమే కొత్తగా బిల్డింగ్ కట్టేశాడు.పడుచుపిల్ల సొగసుల్లాగా కొత్త రంగులతో మెరిసిపోతోంది ఆ బిల్డింగ్.

ఓ అందమైన సాయంకాలం గేటు దగ్గరనుంచున్నాను వీధిలో వచ్చేపోయే జన వీక్షణార్థం.

రమేష్ కొడుకు పదేళ్ళ మురళిగాడు వాడి ఫ్రెండ్స్‌తో అంటున్నాడు "ఈ వీధిలో అన్నిటి కంటే మాదే కొత్త బిల్డింగ్‌రా.." అని.

యాదృచ్ఛికమో, కాకతాళీయమో సరిగ్గా అదే సమయానికి సుబ్బరామయ్య గారు అక్కడికి వచ్చి, ఆ మాటలు విన్నాడు. వాళ్లకేసి చూసి అప్రయత్నంగా నావైపు చూశాడు. అంతకంటే అప్రయత్నంగా ఓ వెకిలినవ్వు లాంటి నవ్వు నవ్వాడు.

నాకు నవ్వాలో, నవ్వకూడదో వెంటనే స్ఫురించలేదు. కారణం ఆయన గత పదేళ్ళుగా బిజినెస్‌లో దెబ్బతిని ఇంటికి రంగులు కూడా వేయించలేదు.

ఖోహెచ్

## మార్పు

కొన్నిసార్లు పరిస్థితులే మనల్ని మార్చేస్తాయి. ఇప్పుడు ప్రీతీజింగ్యానీ విషయంలో అదే జరిగింది. డేరింగ్ అండ్ డ్యాషింగ్ హీరోయిన్లు మల్లికా షెరావత్, బిపాషా బసులు అందర్నీ నేత్రానందం కలిగిస్తుండడంతో ఆమె తన వైఖరిని మార్చేసుకుంది. కొత్త చిత్రం చహతేలో వారిలాగే అందర్నీ అలరించే సన్నివేశాల్లో నటించడానికి ఒప్పేసుకుంది. ఈ మార్పు ఆమెకి అవకాశాల్ని పెంచుతుందేమో చూద్దాం.

